

# దీపం పురుగులు

యేదూరు ధనంజయరెడ్డి

నిత్యమూ నిరంతరమూ దుర్భరమైన కష్టాలలో మునిగి తేలుతూ ఉంటారు కొందరు. పరిస్థితి చక్కబడుతుందనే ఆశా లేశం కూడా కనుపించదు. వేరొక మార్గం తొక్కితే చాలు, బతకవచ్చు—అన్న సూచన గోచరిస్తే నిలదొక్కుకొనడం వారికి అసాధ్యం.

**మధ్యాహ్నం** పన్నెండు గంటలు దాటిపోయింది. అరి చెయ్యి చాచి బలంగా ముఖంమీద కొడుతున్నట్లు వీస్తోంది వడగాలి.

ఏదో ఆశతో ఎదురు చూస్తున్నాడు రిక్షా రామయ్య రిక్షామీద కూర్చుని. విధిగీచిన వికృత మయిన గీతల్లా అతని ముఖంమీద చోటు చేసుకున్న ముసలి ముడతల్లో నుండి జారుతున్నాయి చెమట బిందువులు. వాటిని చేత్తో ఊడ్చి దులిపెయ్యగలుగుతున్నాడు. కాని, అంతరంగంలో మెదులుతున్న ఆశను అలా దులిపెయ్యటానికి అశక్తు డయిపోతున్నాడు.

'ఎవరో వస్తున్నారు, తన రిక్షా ఎక్కటానికి' అనుకున్నాడు. క్షణ కాలం ఆశాదీపం వెలిగింది. ఆ వెలుగులోనే వెదుక్కోబోయాడు ఆసరా. ఆగపడని ఆసరా ఆశానిరాశల మధ్య త్రిశంకు స్వర్గంలా కొట్టుమిట్టాడుకుపోయింది.

''ఏం బాబూ! ఎక్కడికి వెళతారు? ఎక్కండి రిక్షా'' అన్నాడు. ఆ వ్యక్తి సమీపించే కొద్దీ రామయ్య కళ్ళలో కాంతి అధికం కాసాగింది. అతను వచ్చి రామయ్యను, అతని ముఖంలాగే ముకుళించుకు పోయిన పాత రిక్షాను చూశాడు. అతని కళ్ళు సానుభూతితో నిండిపోయాయి.

''ఎందుకు, తాతా, ఇంత వయస్సులో ఈ పాట్లు?'' అతను చూసే సానుభూతి చూపులకు రామయ్య ఎలానో అయిపోయాడు. ''ఒక్క ప్రాణం నిలుపుకోటానికి ఇంత ప్రయాస పడాలా? ఇంద, ఈ పది పైసలు'' అని రామయ్య చేతిలో పది పైసల నాణెం పెడుతూ, ''ఈ మాత్రం చెయ్యి చాస్తే చాలు. నీ ముఖమే నీకామాత్రం అన్నం పెడుతుంది'' అంటూ తన కరుణార్ద్ర హృదయాన్ని రామయ్య మీద గర్వంగా ప్రయోగించి టాక్సీ మీద వెళ్ళిపోయాడా వ్యక్తి.

రామయ్య అలాగే స్తంభించిపోయాడు. చేతిలో ఉన్న పది పైసలు చూశాడు. అతని శూన్య హృదయం ప్రకంపించింది. ఆ వ్యక్తి మాటలు పదేపదే వినిపిస్తున్నాయి. ''ఎందుకు, తాతా, ఇంత వయస్సులో ఇన్ని పాట్లు?'' తను అంత పనికిరాని వాడై పోయాడా? అనుకున్న రామయ్య అప్రయత్నంగా శరీరం వేపు చూసుకుంటూ, ముఖాన్ని తడుముకుని వయస్సు లెక్క వేసుకున్నాడు. తరవాత అతని ముఖంలో శుష్కహాసం తప్ప మరేమీ మిగల లేదు.

''ఈ మాత్రం చెయ్యి చాస్తే చాలు. నీ ముఖమే నీ కామాత్రం అన్నం పెడుతుంది.'' మళ్ళీ ఏదో ఆశ చిగురించింది. చెయ్యి మరికొద్దిగా ముందుకు చాపాడు. 'ఇలాగేనా యాచించాలి?' అనుకున్నాడు. మరుక్షణంలోనే చెయ్యిమీద ఎవరో కొరడాతో కొట్టినట్లు వెనక్కు లాగేసుకున్నాడు. 'ఛీ, యాచించి పొట్ట నింపుకోవాలా? దానికన్నా పెద్ద అబద్ధం తన జీవితంలో మరొకటి ఉండదు. ఉండకూడదు' అనుకున్నాడు.

ఒక్క ప్రాణం నిలుపుకోటానికి ఇంత ప్రయాస పడాలా? ఇంకొక మాట వినపడింది ఆ వ్యక్తిది.

'ఈ నా ప్రయాస అంతా నా ఒక్కడికోసం అనుకున్నాడు కాబోలు' అనుకున్న రామయ్య మనస్సు కొంత తెరిపిన పడింది.

కడుపులో గురగుర మంటున్నది ఆకలి. ప్రొద్దున్న అనగా తాగిన తేట గంజి ఇంతవరకూ ఆకలి ఆప గలదా? పోనీ, తను ఎలాగో ఈ ఆకలి ఆపు కుంటాడు. కాని పాపం, కోడలు పిల్ల? ఆరు నెల లయినా తిరగని మనవడి జానెడు పొట్ట నింపే పాలు కూడా లేకపోతే ఏమైపోతాడు? వాడికోస మయినా కోడలు పిల్లను బాగా చూడాలి. ఆ కొడుకు కన్నుమూసే ఆఖరి క్షణాల్లో వాడి మనసంతా వాళ్ళ చుట్టూ ఎన్నిసార్లు తిరిగిందో. అలాంటి వారి ఆనందంకన్న వాడి మనస్సుకు శాంతి కలిగించే విషయం వేరే ఏముంటుంది?

పాపం! నాకోసం పార్వతి ఎదురు చూస్తూ ఉంటుంది. మనవడు కూడా ఎదురు చూస్తుంటాడా బోసినోరు చాపుకుని. నవ్వుకున్నాడు. 'మనవడు బొద్దుగా ఉండి ఎంత ముద్దొస్తున్నాడు! అలాంటి మనవడి కడుపు నింపగలుగుతున్నప్పుడు తన కడుపు మాడితేనేం? అయినా, నూరేళ్ళు వెలగవలసిన దీపంలో చమురు పొయ్యగలిగాక, కొన ఊపిరితో గింజుకుపోయే దివ్వె ఆరిపోయినా నష్టమేముంది కనక?' అనుకున్న రామయ్యకు 'కనీసం వాడి పొట్ట అయినా పోషించగలనా?' అనే అనుమానం వచ్చింది.

జేబులో చెయ్యి దూర్చాడు. పావలాకాసు అంచు గరగరలాడింది. చప్పబడిపోయాడు. తన కొడుకు వెళ్ళిపోయిన దగ్గిర నుండీ అంతకన్నా ఎక్కువ జేబులో ఉండగా చూడలేదు. ఈ వేళ కూడా అంతే జరిగింది. దానిమీద మూడు జీవితాలు గడవాలి. వ్యర్థతా పూరితమైన నవ్వు నవ్వుకున్నాడు రామయ్య.

''ఏం మావాఁ?'' ఎవరో పిలిచేసరికి పక్కకు తిరిగి చూశాడు. నవ్వుతూ కనపడ్డాడు నరిసిగాడు.

''ఇదేంటి మావాఁ. సూస్తూండగానే బూమిలో మరీమరీ ఒంగిపోతున్నావు. ఇంత వయస్సులో ఏమిటి మావాఁ ఇంత బండ చాకిరీ. ఛ, ఛ, నాకేం నచ్చ లేదు సుమీ నీ వేమనుకుంటే అనుకోగాని.''

'అందరూ ఒకటే మాట! అందరూ నామీద సానుభూతి చూపినవాళ్ళే. చాకిరీ చెయ్యక మరేం చెయ్యాలనో వీళ్ళ ఉద్దేశ్యం' అనుకున్నాడు రామయ్య.

''అయినా తెలీకడుగుతాను గానీ, ఆటోరిక్షాలు, టాక్సీలు రుసి మరిగిపోయిన ఈ మొనగాళ్ళకి నీ తుక్కు రిక్షా పనికొస్తదా యొర్రిగాని'' అన్నాడు జాలి చూపుతూ. జేబులో నుండి చుట్ట ముక్క తీసి రామయ్య కందించాడు నరిసిగాడు, రామయ్య ముఖంలోనికి పరీక్షగా చూస్తూ. రామయ్యకు చుట్టంటే ఆరోప్రాణమన్న సంగతి నరిసిగాడికి తెలుసు. చుట్ట చూడగానే పోతూన్న ప్రాణం తిరిగి వచ్చినట్లయింది రామయ్యకు. నరిసిగాడు గీసిన అగ్గిపుల్లతో చుట్ట ముట్టించుకుని ఎండి ఆరి పోయిన నోటిని తృప్తిగా చప్పరించాడు.

''మరెట్టాగురా, నరిసిగా? నన్నన్యాయం చేసి నా కొడుకు నెత్తికెళ్ళిపోయాడా ఆ దేముడు. ఆదే ఉంటే, నేనిలా, ఈ వయస్సులో రిక్షా లాగుతూ బతకవలసిన అగత్యం ఒచ్చి ఉండేదా. పోయినోడు ఎలాగూ పోయాడు గదా అని ఆడితోపాటు మనల్ని మనం సంపుకుంటావా?''

''అయ్యయ్యో, ఇప్పుడు మాత్రం నీకేం తక్కువొచ్చిందంట! కాలుమీద కాలేసుకుని దరిజాగా బతకొచ్చునే. ఆఁ. బాగా ఉందే అదేదో సామెత జెప్పినట్టు'' అంటూ ముఖాన్ని సాగదీసాడు నరిసిగాడు.

''ఎట్టా కుదురుద్దిరా?'' నిస్పృహగా అంటూ కాలిన చుట్ట నివురు దులిపి నోట్లో పెట్టు కున్నాడు.

''ఛ, ఛ. ఏంటి మావాఁ ఇంత ఒయిసొచ్చి నోడివి. అన్ని విషయాలు ఎంత బాగా తెలిసుండాలి. ఇంకా నీకు సెప్పాలా? అయినా ఆడదాని అందం మీద అంత నమ్మకం పోయిందన్న మాట. అంతేలే.''

''అంటే...'' అర్థం కానట్టు చూశాడు. నోట్లో సగం కాలిన చుట్టముక్క జారిపోయింది.

''అంటే పూర్తిగా ఇవరించి సెప్పాలా? అయితే విను. పూర్వకాలంలో ఒక అందమైన ఆడది పట్టుబట్టి నడుం కట్టు కట్టిందంటే ఏం చేసిందో తెలుసా? మహా మహా రాజుల్ని సైతం మట్టు బెట్టేసింది. అవును కదా. అలాంటిది ఈ కాలంది ఆమాత్రం రెండు జీవాల్ని పెంచలేక పోద్దా. పిచ్చిగాని. ఉన్న ఆ కాసిన్ని రోజులు దరిజాగా గడపకుండా ఎందుకిన్ని అవస్థలు చెప్పు. ఆఁ. ఏమి టాలోచిస్తున్నావు. 'ఊఁ' అను, నీ దరిజా ఎలా మారిపోద్దో. ఇల్లు బంగరమయిపోదట మావాఁ

## ఇంగ్లీషు టెరిలిన్



పెంట్, షర్టు ముక్కలు (1.25 & 2.15 మీటరు) రెండు ముక్కలకు క్లియరెన్సు అమ్మకపు ధర రు. 25/-లు. రెండుసెట్లు (2.50 & 4.30 మీటరు) రు. 48-లు. సూటు నిడివి ఇంగ్లీష్ టెరిలిన్ (3 మీటర్లు) రు. 40/- వి.పి.పి. చార్జీలు రు. 2-50.

**ARVIND AGENCIES (WAP-25), Box 1408, Delhi-6.**

## ఇంకా పొడుగు ఎదగండి



నూతన శాస్త్ర పద్ధతులతో, వ్యాయామములతో ఎక్కువ పొడుగు కండి, ఆరోగ్యవంతులు కండి. స్త్రీ, పురుషలకు ఎల్లరకు అనువైనది. దీని వంటి కోర్సు, లేక పుస్తకం మరొకటి లేదు. వివరములు ఉచితం.

**TOTAL HEALTH**
**Azad Market (A.P.V.)**
**Delhi-6.**




## పొడుమైన కాల్గేట్ బహుళార్థక టాల్కులో చల్లని, పరిమళ సంపద

మనోహరమైన పరిమళము కలిగి.. ఆశ్చర్యము గొలిపే పొడుమైన ఒక ఉత్తమమైనటాల్కు: మీకు అద్భుతమైన చల్లని, సువాసనతో ఆహ్లాదకర మైనతాజాహాయిని రోజంతా యిస్తుంది. యింటిల్లపాదికీ, పసిపాపతో సహా ఎంతో ఉత్తమమైనది.

## కాల్గేట్ ఆల్-పర్‌పస్ టాల్క్

CAPT. G. 3 TEL


# దీపం పురుగులు

నీ కోడలు పిల్ల సూపిసిరితే." ఇంకా ఏమి టేమిటో అనబోతున్న నరిసిగాడి చెంప అపుకుందామన్నా అపుకోలేని రామయ్య కోపానికి ఆహుతి అయిపోయింది. రామయ్య ఒళ్ళు కోపంతో వణికిపోతోంది. నరిసిగాడికి భయమేసింది రామయ్యను చూస్తే. మెల్లిగా తప్పుకుందామని అడుగు పక్కకు జరిపాడు. తప్పటడుగు వేశావన్నట్లు సగం కాలిన చుట్ట చురుక్కు మనిపించింది. అబ్బ అనుకుంటూ జారిపోయాడు.

కాని జారిపోలేకపోయిన వాడి మాటలు మాత్రం రామయ్య మెదడు కొరికేస్తున్నాయి. ఈ లోకాన్ని, దాని తీరును అర్థం చేసుకోవటానికి తన అరవై యేళ్ళూ చాలలేదనుకున్నాడు. అరవైయే కాదు, నూరేళ్ళ బతుకూ అంతేనేమో?

ఆర్థికమైన అంతస్తుల్లో అడుగునబడి చితికిపోయాడు తను. కావచ్చు. అంత మాత్రాన వాళ్ళకు హృదయాల అంతస్తుల్లో కూడా ఒక స్థానమంటూ ఉండదా? ఉండ కూడదా? ఈ స్వార్థపూరిత ప్రపంచం ఉండనివ్వదా? నిర్మలమైన వారి అంతఃకరణలు కూడా మలినమైపోవాలన్నమాట! అర్థంలేని ప్రపంచంమీద అర్థపూరితమైన తన ఆవేశాన్ని ఎలా చల్లార్చుకోవాలో తెలియక తనలో తనే కుమిలిపోయాడు.

లేకపోతే ఏమిటి? ఒకడు ప్రతివాణ్ణి బాబూ అని యాచించి పొట్ట నింపుకోమంటాడు. మరొకడు వ్యభిచరించి బ్రతక మంటాడు దర్జాగా. ఇంకొకడు ఇంకొకటి అంటాడు. మరి ఏమిటి ఈ సమాజానికి అర్థం?

'నిప్పుకు నివురు కప్పినంతమాత్రాన అది నిప్పు కాకుండా పోయిందా? లేక మసి బొగ్గు అనుకున్న ఈ లోకానికి మతిగాని పోయిందా?'

'రాజుల్ని సైతం మట్టు బెట్టేసిన ఆడదాని అందం ఆమాత్రం రెండు జీవాల్ని పెంచలేక పోద్దా?' ఎంత ధీమా!

కోడలు పిల్ల అందం తెలుసు రామయ్యకు. 'అది తలుచుకుంటే రెండు జీవాల్నే కాదు, రెండు పదుల జీవితాల్ని పెంచగలదు. కాని, ఛీ, ఛీ, అదీ ఒక డబ్బేనా? అలాంటి డబ్బుకు ఆశ పడదు పార్వతి. అది మట్టిలో పుట్టిన మాణిక్యం' అనుకుని చెదిరిపోయిన మనస్సుకు సర్ది చెప్పుకున్నాడు రామయ్య.

ఇంటికి వెళ్ళేసరికి పార్వతి దిగులుగా కనపడింది రామయ్యకు.

"ఏమిటే, పార్వతీ, అలా ఉన్నావు?" అడిగాడు.

పార్వతి కళ్ళలో నీళ్ళు తిరిగాయి. "సంటోడి ఒళ్ళు పేలిపోతున్నాది మామా. ఉష్ణం బాగా ఒచ్చేసింది. కన్ను తెరవలేకపోతున్నాడు" అంది.

తనకు తెలిసిన నాటు వైద్యుడి దగ్గిరికి గబగబా పరిగెత్తాడు రామయ్య అంతకన్నా గతిలేక. కాని ఆ వైద్యం ఫలించక పోయింది.

పట్నం మంచి డాక్టరు దగ్గిరికి తీసుకు వెళితేగాని

లాభం లేదనుకున్నాడు రామయ్య. కాని, డబ్బు లేదే మరి? 'తన స్థితి చూసి జాలిపడే డాక్టరు ఉన్నాడా?' నిస్పృహగా అనుకున్న రామయ్యకు ఒక ఆలోచన తగిలింది. అంతకన్నా గతిలేకపోయింది. లేని బలంతో పుంజుకున్నాడు.

• • •

"రండి, బాబూ. రండి. ఎక్కడికెళ్తారు? ఎక్కండి రిక్షా" అని దారిన పోయే ప్రతివాణ్ణి అడుగుతున్నాడు రామయ్య ఎవరైనా రారా అని.

దగ్గిరికి వచ్చి పోతున్నారు. కోపం పీకల వరకూ వస్తోంది రామయ్యకు. కాని ఏం చెయ్యగలడు? 'పేద కోపం పెదవులకు చేటు'. నిస్పృహగా పక్కకు తిరిగాడు. రిక్షా కనపడింది. 'దానిలో ఏదైనా లోపం ఉందా?' అనుకున్నాడు. తను బుద్ధి ఎరిగిన నాటి నుండీ తనను పెంచుతూ వచ్చింది ఆ రిక్షాయే గదా. అలాంటిదానిలో తను ఏం లోపం ఎంచగలడు? కృతజ్ఞతతో రామయ్య కళ్ళు నిండిపోయాయి.

"ఏయ్ బుడ్డా!" అని ఎవరో పిలిచేసరికి పక్కకు తిరిగి చూశాడు. కాబూలీవాలా ఎదురుగా ఇంతింత మీసాలతో గడ్డంతో నిల్చుని ఉన్నాడు.

"ఎక్కడికెళ్తారు, బాబూ?" వినయంగా అడిగాడు.

"మైలాపూర్" అని, ఎంత కావాలన్నట్లు చేతులు ఊపాడు "కిత్నా, కిత్నా" అంటూ.

"మైలాపూర్ అంటున్నారు. ఆ చివరికి పోవాల, బాబూ. తమరికి తెలియన్దికాదు. రూపాయి డబ్బు లిప్పించండి" అన్నాడు రామయ్య.

"ఏక్ రూపియా!" ఆశ్చర్యపోతూ వెనక్కు తిరిగి పోబోయాడు.

"మరెంతిస్తారు, బాబూ?" రాగారాగా వచ్చిన బేరం వెనక్కు తిరిగి పోతూంటే భయం వేసింది రామయ్యకు, అదీ తప్పిపోతుందేమోనని.

"చరణా, నాల్గ అణా ఇస్తావ్. ఏమంటావ్?" అన్నాడు కాబూలీవాలా. పాపం! రామయ్య ఎలాగో అయిపోయాడు.

ఆకలితో అలమటించిపోతూన్న కడుపుకి, ఎండ ఒకటి తోడు. రెండున్నర మైళ్ళు లాక్కు వెళ్ళాలి. నిజంగా కొన్ని వేల చమట బొట్ల శ్రమ. అంతటి శ్రమకు ధర నాలుగణాలు!

రామయ్య ముఖంచూసి లొంగిపోతాడు అనుకున్నాడు కాబూలీవాలా. బెట్టుచేసి వెనక్కు తిరిగి పోబోయాడు. రామయ్య మనస్సు గింజుకున్నది. జేబులో అప్పటికే సంపాదించిన ఒక ముప్పావలా ఉంది. 'ఇదైనా కలిసొస్తే మనవడికి ఆమాత్రం మంచి మందు ఇప్పించవచ్చు' అనుకున్నాడు.

"రండి, బాబూ. అర్ధరూపాయి చేస్కోండి."

"నహీ, నహీ. నాల్గణాలకు ఒక్కపైసా ఎక్కువ లేదు." రామయ్య ముఖంలోని దైన్యాన్ని కొలవ గలిగేటంత జాలి ఆకర్కోటకుడు కాబూలీలో కరువయింది.

"సరే." విధిలేక లొంగిపోయాడు.

జాలి ఎరగని నవ్వు ఒకటి కాబూలీ మీసాలచాటు నుండి తొంగి చూసింది.

ముందుకు రిక్షా లాగాడు రామయ్య. . . .

కాబూలీవాలా దిగిపోయాడు. రామయ్య చేతిలో పావలా పెట్టాడు. చేతిలోని పావలా అలానే చూస్తూ ఉండిపోయాడు రామయ్య. గుటక వేశాడు ఆయాసంతో. ఎండిపోయిన గొంతు కఠినంగా బాధపెట్టింది. కళ్ళు కొద్దికొద్దిగా తిరుగుతున్నాయి. 'ఇంకొక రూపాయి సంపాదించ గలిగితే ఇంకా మంచి మందు ఇప్పించవచ్చు మనవడికి' అనుకుని బేరం కోసం వెదుకుతూ ముందుకు లాగాడు రిక్షా. పోగా పోగా కళ్ళు బాగా తిరగడం ప్రారంభించాయి. కొంతసేపటికి తన పట్టుతప్పి రిక్షా ఎక్కడికో జారిపోతూండేసరికి రామయ్యకు భయం వేసింది తనేమైపోతున్నాడోనని. కాని అప్పటికే అతని శరీరంలో పట్లు సడలిపోయాయి.

• • •

కళ్ళు తెరిచాడు రామయ్య. తల రెండింతల బరువుగా ఉంది కట్లతో. శరీరంలో నరాలన్నీ పీకుతున్నాయి. బాధగా కళ్ళు మూసుకున్నాడు. పరిస్థితి అంతా లీలగా గుర్తుకు వచ్చింది. పార్వతి, జ్వరంతో ఉన్న మనవడు అతని మూసుకున్న కంటి రెప్పలమీద కదిలారు. బాధ అంతా మనస్సులోని ఆత్రతలో కరిగిపోయింది. "బాబూ, ఎప్పటినుండి ఇలా పడి ఉన్నాను?" ఆదుర్దాగా అడిగాడు.

"ఫరవాలేదులే. ఆవేశపడకు. త్వరగా నయమయిపోతుంది" అంది నర్సు.

"లేదమ్మా. ఆవేశం కాదు. ఎప్పటినుండి ఇలా ఉన్నానో కొద్దిగా చెప్పండి."

"రెండు దినాల నుండి."

"ఆఁ. రెండు దినాలే!" పిచ్చి ఆవేశంతో పట్టుకుంటున్న వారందర్నీ విదిలించుకుని పరిగెత్తాడు బయటికి.

ఆకాశంలో నక్షత్రాలు మేమూ ఉన్నాము అన్నట్లు నామమాత్రంగా మెరుస్తున్నాయి, రామయ్యలాంటి వాళ్ళ జీవితాల్లా. అంత నిశీథిలో, నిశ్శబ్దంలో రొప్పుతూ పరిగెత్తుకుంటూ ఇంటి దగ్గిరికి వచ్చి, "పార్వతీ" అని పిలిచాడు. పరిగెత్తిన ఆవేశంలో గొంతుక సమంగా పెగలలేదు. ఇల్లంతా చీకటిగా నిశ్శబ్దంగా ఉంది. చుట్టుపక్కలు ప్రతిధ్వనించేటట్లు మళ్ళీ పిలిచాడు.

"ఎవరూ? రామయ్యా?" అంటూ పొరుగు కొంపలోని పోలమ్మ వచ్చింది.

"అవును, నేనే.రామయ్యని. పార్వతి ఏది? మనవడు ఏడి, పోలమ్మా?" అతని కంఠస్వరంలో ఆత్రత క్షణక్షణానికీ అధికమౌతూంది.

"మనవడు, నువ్వు వెళ్లిన సాయంత్రమే సచ్చిపోయాడు, రామయ్యా."

అప్పుడే సగం చచ్చిపోయాడు రామయ్య. 'మరి తనింకెవరికోసం బ్రతకాలి?' అనుకున్నాడు.

"మరి.. మరి పార్వతి?"

"పార్వతా? ఏం చెప్పను, రామయ్యా. ఇష్టంలేకపోయినా ఆ నరసిగాడితో పోయింది. మరేం చేస్తుంది? కొడుకా సచ్చిపోయాడు. నీవా ఎల్లిపోయి రెండురోజుల వరకూ రానేలేవి. ఇంకేం చేస్తుంది? ఈ లేపి శరీరాన్ని పోషించుకోటానికి, ఆఖరికి దాన్నే అమ్ముకోటానికి మనసయ్యింది." ఆమె మాటల్లో ఏమాత్రం ఏహ్యభావం లేదు. 'ఆ పరిస్థితిలో నేనున్నా అంతకన్నా ఏం చెయ్యలేను' అనే భావము, పార్వతి అలా అయిపోయినందుకు సానుభూతి వినిపిస్తున్నాయి ఆ మాటల్లో.

పూర్తిగా చచ్చిపోయాడు రామయ్య. 'పార్వతీ' అని కుమిలి ఏడవటానికి కూడా శక్తిలేదు అతనిలో. కాళ్ళు ఈడ్చుకుంటూ దారి తీశాడు. ఎక్కడికో అతనికే తెలియదు.

దూరంగా ఏదో దీపస్తంభం కనబడుతూంది. అక్కడికే అన్నట్లు కాళ్ళు ఈడుస్తూ పోయి, అంతకన్నా మించి గమించే శక్తిలేక అలానే దీపస్తంభం మొదట్లో కూలబడి పోయాడు. అతని కళ్ళు దీపం వేపు, తమకు వెలుతురు ఇస్తుందనే భ్రమతో దాని చుట్టూ భ్రమిస్తూ దాని వేడిలోనే మాడిపోయే పురుగులవేపు వికృతంగా చూస్తున్నాయి. తన అరవై ఏళ్ల బరువు జీవితంలోనూ చూడలేకపోయిన సత్యం, నిజమైన అనుభవం ఆ ఆఖరు క్షణాల్లో చూశాడు రామయ్య. ★

# హృదయం కదిలించే ఘట్టాలు

## దుత్తా బాబురావు

**హృదయాన్ని** కదిలించే ఘట్టాలు
ప్రకృతిచేసే వికృతాట్టహాసాలు.
సాయం సంధ్యలో కాకుల బారులు,
నిశ్చల సముద్ర మధ్యంలో తుపానుల హోరులు,
గోదావరి వరదల సమ్మోదమ్ములు,
అమాయక జనుల ఖేదమ్ములు.
భావుకుల హృదయ విచ్ఛేదకములు!
వెన్నెల ఇచ్చే జాబిల్లి
కన్నులలో పువ్వు వేసింది.
కళ్ళకు విందుగూర్చే గులాబీ
ముళ్ళపై పవ్వళించింది.
వన్నెలు మాసిన మొగలి
అత్తరులో స్నానంచేసింది
సువాసనలు చిమ్మే సంపంగి
క్రూర సర్పంతో కాపురంచేసింది.
అప్సరసలాంటి పక్కింటి అమ్మాయి
అవిటిగా నడిచింది.
అందమైన అతగాడి మోములో
అమ్మవారు నవ్వింది.
దిక్కులేని బిచ్చగత్తె జిల్లేడు నీడల్లో
తల్లి అనిపించుకున్నది.
ప్రియుని చావు విన్న గృహిణి
పతిని గట్టిగా వాటేసుకున్నది!
హృదయాన్ని కదిలించే ఘట్టాలు.
ప్రకృతి చేసే వికృతాట్టహాసాలు,
అర్థంకాని భగవల్లీలలు! *